ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం అక్టోబరు 4, 2024



మేమాడితే.. లోకమే ఆడదా!

ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు.. ఆచరణాత్మక విద్యలో భాగంగా వైద్య సేవల్లో తలమునకలై ఉండే మెడికోలు.. జోరుగా, హుషారుగా ఆడిపాడారు. చదువులోనే కాదు.. సరదాలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపించారు. వీరి సంతోషాలు, కేరింతలకు నెల్లూరులోని వైద్య కళాశాల వేదికైంది.. కళాశాల వార్షికోత్సవంలో భాగంగా గురువారం వైద్య విద్యార్థులు ప్రదర్శించిన బృంద నృత్యాలు భళా అనిపించాయి. - ఈనాడు, నెల్లూరు



నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల ప్రదక్షిణ.. చండీ అలంకరణలో అమ్మవారు

నెల్లూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో భవానీగా దర్శనం.. మహిళల కోలాటం

దశదిశలా.. దసరా

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. కలశ ప్రతిష్ఠతో గురువారం ఉత్సవాలు ప్రారంభమవగా- తొలిరోజే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఓ వైపు అమ్మవారి విశేషాలంకరణలు... మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు.. భక్తుల సందడి.. అంతటా అద్వితీయ ఆధ్యాత్మికతను తీసుకువచ్చాయి. - ఈనాడు, నెల్లూరు (సాంస్కృతికం)

ఫ్రీహోల్డ్ మాయాజాలం

పరిశీలనలో వెలుగు చూస్తున్న అక్రమాలు ● ఇష్టారీతిన వ్యవహరించిన రెవెన్యూ అధికారులు

కందుకూరు మండలం జి.మేకపాడులో 69 ఎకరాలకు 2004లో కొందరికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు. నిబంధనల ప్రకారం 2003కు ముందు పట్టాలిచ్చిన వారే ఫ్రీహోల్డ్‌కు అర్హులు. కానీ, ఆ ముసుగులో ఈ 69 ఎకరాలకూ యాజమాన్య హక్కులు కల్పించారు.

కందుకూరు మున్సిపాలిటీలోని ఆనందాపురంలో ఓ మహిళ పేరుతో 2.56 ఎకరాలకు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చారు. సదరు భూమికి లావాదేవీలు జరిగాయని.. అనంతరం పీవోటీలో చేర్చారు. ఇటీవల పీవోటీ ఉంటే యాజమాన్య హక్కులు కల్పించడం కుదరదని కింది స్థాయి అధికారులు అనుమతి నిరాకరించగా.. సీపీఎల్ఏ నుంచే ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

గుడ్లూరు మండలం చేవూరులో 34 ఎకరాలు ఇతరులు అనుభవిస్తుండగా.. వారికి డీకే పట్టా, 10-1 అడంగళ్ లేదు. 1ఏ ఉందన్న కారణంతో ఫ్రీహోల్డ్ చేశారు. పట్టాలు 2003కు ముందు ఇచ్చారా? తర్వాత ఇచ్చారా? అనే కనీస సమాచారం లేకుండానే ప్రక్రియ జరిగింది.

- ఇలా జిల్లాలో జరిగిన ఫ్రీహోల్డ్ జాబితాలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి.

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ హయాంలో 'రెవెన్యూ'లో జరిగిన అక్రమాలు అన్నీఇన్నీకావు. కొందరు రెవెన్యూ అధికారులు, వైకాపా నాయకులు కుమ్మక్కై భారీ అక్రమాలకు పాల్పడ్డారు. అందులో 'ఫ్రీహోల్డ్' వ్యవహారం ఒకటి. 20 ఏళ్లు దాటిన.. అంటే, 2003కు ముందు పేదలకు పంపిణీ చేసిన భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని మాటున నిబంధనలకు విరుద్ధంగా వేల ఎకరాలకు హక్కులు కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వ సూచనల మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి.. వారం రోజులుగా విచారణ జరుపుతుండగా- నాటి వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాబితా పరిశీలిస్తున్న వీఆర్వోలు

మొత్తం 48,233 ఎకరాలు

రాష్ట్ర వ్యాప్తంగా అసైన్‌మెంట్ లబ్ధిదారులకు భారీగా లబ్ధి చేకూరుస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం గత ఏడాది ఆర్భాటంగా ప్రకటించింది. మండలాల వారీగా అసైన్‌మెంట్ పట్టాల వివరాలు సేకరించింది. ఆ క్రమంలో జిల్లాలో 48,233 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. ఇక్కడే అధికారులు, నాటి అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై అక్రమాలకు తెరలేపారు. 2003 తర్వాత పట్టాలిచ్చిన, అసలు పట్టాలే లేకుండా ఆన్‌లైన్‌లో ఉన్న భూములకు సైతం హక్కులు కల్పించారు. దీనిపై అప్పట్లోనే అనేక విమర్శలు, ఆరోపణలు రావడంతో.. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి.. మండలాల వారీగా విచారణ చేయిస్తోంది. ఇందులో ఫ్రీహోల్డ్ చేసిన 48,233 ఎకరాల్లో 10,359 ఎకరాలే నిబంధనల ప్రకారం జరిగాయని, సుమారు 2,881 ఎకరాలు విరుద్ధంగా చేశారని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇంకా 14,374 ఎకరాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అధికారులు ఫ్రీహోల్డ్ భూముల రికార్డుల పునః పరిశీలనలో తలమునకలై ఉన్నారు. మరోవైపు గతంలో ఈ ప్రక్రియలో పాల్పంచుకున్న అధికారులే.. ప్రస్తుతం విచారణ జరుపుతుండటంతో.. పూర్తి స్థాయిలో అక్రమాలు వెలుగులోకి వస్తాయా అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

విచారణ జరుగుతోంది...

ప్రభుత్వ సూచన మేరకు.. అన్ని మండలాల్లో అధికారులు బృందాలుగా ఏర్పడి ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ జరుపుతున్నారు. అది పూర్తయిన అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

– లవన్న, జిల్లా రెవెన్యూ అధికారి

మొదటి రోజు టెట్ ప్రశాంతం

156 మంది గైర్హాజరు



పొట్టేపాళెం కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటూ.. పరీక్ష అనంతరం బయటకు వస్తున్న అభ్యర్థులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో ఏపీ టెట్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యాశాఖాధికారులు.. మొదటి రోజు గురువారం మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. కావలిలోని విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జొన్నవాడ రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రాల్లో పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించారు. మొదటి రోజు ఉదయం 725 మందికి 644, మధ్యాహ్నం 725 మందికి 650 మంది హాజరయ్యారు. పరీక్షలను డీఈవో పీవీజే రామారావు పర్యవేక్షించారు. ఈ నెల 21వ తేదీ వరకు జరగనున్నాయి.



అభిప్రాయాలు సేకరిస్తున్న కలెక్టర్ ఆనంద్.. చిత్రంలో ఎంపీ వేమిరెడ్డి, ఛైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే కాకర్ల

ప్రజల సహకారంతో విజన్ కార్యాచరణ ప్రణాళిక

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో స్వర్ణాంధ్ర-2047 విజన్ కార్యాచరణ ప్రణాళిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణ ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రజల సూచనలు, సలహాలు తీసుకునేందుకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, అందరూ దాన్ని స్కాన్ చేసి.. పొందుపరచాలన్నారు. జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు స్థాపించి.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. రామాయపట్నం పోర్టులో బీపీసీఎల్ కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చారని వెల్లడించారు. విద్యుత్తు వినియోగం పెరుగుతున్న దృష్ట్యా తక్కువ ధరకు దాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గ్రామీణాభివృద్ధిపై పలు సూచనలు చేయగా- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ... విజన్ డాక్యుమెంట్ ద్వారా నియోజకవర్గ రూపురేఖల్లో మార్పు తీసుకువస్తానని తెలిపారు. పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి తమ శాఖల పరిధిలో రూపొందిస్తున్న డాక్యుమెంటరీని వివరించారు. మేయర్ పొట్లూరి స్రవంతి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సహకారానికి జవసత్వాలు

వైకాపా ప్రభుత్వ హయాంలో గాడి తప్పి.. రాజకీయ వేదికలుగా మారిన వ్యవసాయ సహకార పరపతి సంఘాలను గాడిలో పెట్టే పని ప్రారంభమైంది. వాటికి తిరిగి జవసత్వాలు నింపి.. రైతులకు ప్రయోజనకరంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది.

నెల్లూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో 78 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా- ఇవి ప్రధానంగా ధాన్యం ప్రొక్యూర్‌మెంట్, ఎరువులు, అమ్మకాల ద్వారా ఆదాయం సమకూర్చుకునేవి. రైతులకు అందించిన రుణాలపై వచ్చే వడ్డీ రాబడితో నడిచేవి. మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 50 శాతం మేర ఎరువులను రైతులకు సరఫరా చేసేవి. గత ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల పేరుతో ఓ వ్యవస్థను ఏర్పాటు చేసినా.. అక్కడ సౌకర్యాలు కల్పించలేదు. మరోవైపు సొసైటీలను సైతం నిర్వీర్యం చేసింది. ఫలితంగా రైతులకు ఎరువులను సరఫరా చేయడంలో వెనుకబడటంతో పాటు.. రైతుల నుంచి డిపాజిట్ల సేకరణ, ఎరువుల వ్యాపారానికి అవసరమైన గ్యారెంటీలు పొందడం..



గోదాములను సిద్ధంగా ఉంచుకోవడం వంటి అంశాల్లో సొసైటీలు నామమాత్రంగా మిగిలాయి. పైగా, నాటి వైకాపా సర్కారు ఆ సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. పార్టీ నాయకులనే పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించి.. సంఘాలను రాజకీయ వేదికలుగా మార్చేసింది. కొన్ని పీఏసీఎస్‌లలో భారీగా అక్రమాలు జరిగి, సంఘాల నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తగా.. కొన్నింటిలో ఎరువులు తీసుకువెళ్లి సకాలంలో సొమ్ములు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఇలా మొత్తంగా సహకార స్ఫూర్తి దెబ్బతింది. జిల్లాలోని సంఘాల్లో 30కి లైసెన్సులు లేకపోగా.. మరొకటి పూర్తిగా మూతపడింది.

కూటమి ప్రభుత్వ చర్యలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే

పీఏసీఎస్‌ల ద్వారా ఎరువుల విక్రయం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)ను గాడిలో పెట్టే చర్యలు చేపట్టింది. జిల్లాలోని 78 పీఏసీఎస్‌లలో 47కు మాత్రమే లైసెన్సులు ఉండగా.. ఇప్పుడు విత్తనాలు, ఎరువులను వీటి ద్వారా అందించాలని నిర్ణయించింది. ఆ నేపథ్యంలో లైసెన్సులు పునరుద్ధరించాలంటే.. కొన్ని నిబంధనలు అడ్డుగా మారాయి. వాటిని అధిగమిస్తూ.. మార్క్‌ఫెడ్, సెంట్రల్ బ్యాంకు, సహకార, వ్యవసాయశాఖల సమన్వయంతో సంఘాలకు లైసెన్సులు మంజూరు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందరికి శిక్షణ ఇవ్వగా.. మిగిలిన వారికి ఈ నెల 16 నుంచి నెలాఖరు వరకు శిక్షణ ఇచ్చి.. లైసెన్సులు అందజేయనున్నారు.

అన్ని సంఘాలకు లైసెన్సులు

జిల్లాలోని అన్ని సంఘాల ద్వారా ఎరువుల అమ్మకాలు జరగాలన్నదే లక్ష్యం. ఇప్పటికే ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ నెల 16 నుంచి కేవీకేలో మరికొందరికి ఇస్తాం. ఆ ప్రక్రియ పూర్తి కాగానే లైసెన్సులు ఇస్తాం. ఈ రబీలో ఎరువులు అందజేస్తాం.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

అవినీతి జరిగితే.. కౌన్సిలర్లకు బాధ్యత లేదా?

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలో అవినీతి జరిగితే కౌన్సిలర్లకు బాధ్యత లేదా? మీకు తెలియకుండా నిధులు ఎలా ఖర్చుపెడతారని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రశ్నించారు. గురువారం ఛైర్‌పర్సన్ సుప్రజ అధ్యక్షతన బుచ్చి నగర పంచాయతీ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నగర పంచాయతీలో లెక్కాపత్రం లేకుండా ఆరు నెలల్లో రూ. 2 కోట్లు ఖర్చు పెట్టారని కౌన్సిలర్లు గళమెత్తారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వంలో అవినీతి ఉండబోదని, అందరూ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. గుత్తేదారులు నగదు తీసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పి సగంలో వదిలేసి మోసం చేశారని, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రూ. 1.2 కోట్లతో కాంట్రాక్ట్ తీసుకుని.. గదులు సగమే నిర్మించారని, గుత్తేదారు పూర్తి బిల్లులు తీసుకుని కనిపించడం లేదని, ఏఈ పనులు చేస్తున్నారని, జల్‌జీవన్ ద్వారా పైప్‌లైన్లు వేయడానికి అనవసరంగా సీసీరోడ్లు తవ్వేస్తున్నారని.. కౌన్సిలర్లు వివిధ అంశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ ప్రత్యూష మాట్లాడుతూ.. తన వార్డులో రెండున్నరేళ్లుగా ఒక్క పని చేయలేదన్నారు. ప్రజలకు కనీస వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన గుత్తేదారులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి.. వారికి పనులు ఇవ్వడం ఆపేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. మురుగు కాలువల్లో పూడికతీతకు రూ. 28.40 లక్షలు మంజూరవగా.. సభ్యులు ఆమోదం తెలిపారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆశలన్నీ సమీక్ష పైనే...

రైల్వే జీఎంతో నేడు ఎంపీల భేటీ


బిట్రగుంట రైల్వేస్టేషన్

బిట్రగుంట, న్యూస్‌టుడే: రూ. వందల కోట్ల విలువైన రైల్వే ఆస్తులు. కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు అనువైన ప్రాంతం.. మౌలిక సదుపాయాలు పుష్కలమే.. అయినా.. ఆది నుంచి బిట్రగుంటపై శీతకన్నే కనిపిస్తోంది... ఇక నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్‌తో పాటు ఇతర సమస్యలు ఉండనే ఉన్నాయి. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ఎంపీలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరుతో భేటీ కానున్న నేపథ్యంలో... వాటిల్లో కొన్నైనా పరిష్కారమవుతాయని, జిల్లా రైల్వే ప్రగతికి మార్గం సుగమమవుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

అప్పుడే పూర్వవైభవం..

ఒకప్పుడు దక్షిణాసియా ఖండంలోనే రైల్వేపరంగా బిట్రగుంటకు పేరు. ఇక్కడ రూ. వందల కోట్లు చేసే 500 ఎకరాలకు పైగా భూములు, విలువైన భవనాలు ఖాళీగా ఉన్నాయి. రైల్వేశాఖ ఎక్కడైనా ప్రాజెక్టు స్థాపించాలనుకుంటే.. అందుకు అయ్యే ఖర్చులో సగం బడ్జెట్ బిట్రగుంటకు కేటాయిస్తే సరిపోతుంది. తద్వారా రైల్వే ఆస్తుల పరిరక్షణతో పాటు బిట్రగుంటకు పూర్వ వైభవం వస్తుంది.


బిట్రగుంట రైల్వేగేటు వద్ద పెద్ద ఎత్తున ఆగిన వాహనదారులు

ఇతర సమస్యలు...

నెల్లూరు నగరం, బిట్రగుంట, కావలి, గూడూరు వంటి కీలక ప్రాంతాల్లో ఆర్వోబీలు, ఆయూబీ నిర్మాణాలు ఏళ్లుగా ఊరిస్తూనే ఉండగా- రైలు గేట్ల వద్ద నిరీక్షణ, ఇక్కట్లు ఎప్పుడు తప్పుతాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మెము రైళ్లలో కొన్నింటిని ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడం సామాన్యులకు భారంగా పరిణమించింది. ఆ క్రమంలోనే టిక్కెట్ల కొనుగోలు తగ్గిందంటూ.. జిల్లాలోని అల్లూరు రోడ్డు, శ్రీవేంకటేశ్వరపాళెం, తలమంచి రైల్వేస్టేషన్లలో స్టాపింగ్‌లు ఎత్తివేశారు. రూ. కోట్లలో భవనాలు కట్టినా.. నిర్వహణ లోపంతో శిథిలమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కావలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల, బిట్రగుంటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలన్న అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

పశువుల భూమి మేత


పశువుల మేత పోరంబోకు భూమిలో నాటిన జామాయిల్ మొక్కలు

మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మర్రిపాడు మండలంలో ఆక్రమణదారులు పశువుల మేత పోరంబోకు భూములను సైతం వదలడం లేదు. కదిరినేనిపల్లి రెవెన్యూలోని సర్వే నం.67లో 90 ఎకరాల పశువుల మేత పోరంబోకు భూమి ఉంది. దీనిపై కొందరి కళ్లు పడ్డాయి. అక్కడ ఉన్న చెట్లను తొలగించి, చదును చేశారు. సుమారు 20 ఎకరాలు ఆక్రమించి జామాయిల్ మొక్కలు నాటారు. ఏళ్లుగా పశువులు.. మేత మేస్తుండగా.. ఆక్రమణల వల్ల వాటికి మేత లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు. ఈ భూమికి సమీపంలో సోమశిల హైలెవల్ కెనాల్ కాలువ వెళుతుండటంతో రాబోయే రోజుల్లో విలువ పెరుగుతుందని యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు స్వప్న తెలిపారు.

ప్రగతి దిశగా పరిశోధనలు సాగాలి



వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు దేశాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని **వీఎస్‌యూ ఉపకులపతి విజయ భాస్కరరావు** సూచించారు. విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన ఒక రోజు ఒరియంటేషన్ కార్యక్రమంలో వీసీ పాల్గొని మాట్లాడారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన నూతన విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఆచార్య సాయినాథ్, త్రివేణి, సాయి స్రవంతి పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ఐసెట్ స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం : ఐసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు వీఎస్‌యూ, కావలి పీజీ కళాశాలల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్లు ఆచార్య హనుమారెడ్డి, సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ నుంచి 7 వరకు అడ్మిషన్లకు గడువుందన్నారు. ఐసెట్-2024 ర్యాంకు కార్డు, డిగ్రీ ధ్రువీకరణ పత్రాలు, పది, ఇంటర్ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఎంబీఏ, ఎంబీఏ టూరిజం ట్రావెల్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ కోర్సులు, కావలి పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఇతర వివరాలకు 94415 99597, 99893 53455 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

స్వయంకృషి.. చిట్టి మొక్కల సృష్టి

ప్రత్యేకత చాటుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కావడం లేదు. తమ పరిజ్ఞానంతో ప్రత్యేకత చాటుతున్నారు. పట్టుదలతో సృష్టికే ప్రతిసృష్టి చేయొచ్చని.. ప్రకృతిలోని పెద్ద వృక్షాలను చిన్నవిగా తయారు చేసి నిరూపిస్తున్నారు. నెల్లూరు నగరంలోని సుంకు చెంగన్న పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఉమాశంకర్. అందమైన చిట్టి మొక్కలు తయారు చేయడంలో ప్రత్యేకత చాటుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

నెల్లూరు నగరం మూలాపేటలో నివాసం ఉండే ఉమాశంకర్.. బోన్సాయి మొక్కలను కొత్త తరహాలో స్వయంగా సృష్టిస్తున్నారు. ప్రకృతి ప్రేమికుడైన ఈయన దాదాపు 20 ఏళ్లగా నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపుగా 150కి పైగా మొక్కలను సృష్టించారు. రెండు నుంచి 20 ఏళ్ల వయసు కలిగిన ఎన్నో మొక్కలు ఆయన నివాసంలో కనువిందు చేస్తున్నాయి. మర్రి, జువ్వి, చింత, రావి, నేరేడు, నిమ్మ, మామిడి, వేప, స్ట్రాబెర్రి, మునగ తదితర మొక్కలు తయారు చేసి ప్రత్యేక కుండీలను ఏర్పాటు చేసి అందమైన బోన్సాయి మొక్కలు పెంచుతున్నారు. దీన్ని అలవాటుగా మలచుకున్నారు.


మొక్కలతో ఉమాశంకర్

గ్యాలరీ

ఊడలతో విస్తరించే మర్రి వృక్షం చిన్నదిగా మలుస్తున్నారు. బుజ్జి బుజ్జి కొమ్మలతో చిట్టి పూలను పూయించేలా కృషి చేస్తున్నారు. ఈ మొక్కల కోసం ఎక్కువమంది వేలాది రూపాయలు ఖర్చుపెట్టి తమ ఇళ్లలో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉమాశంకర్ మాత్రం స్వయం కృషితో కొన్నింటిపై ప్రయోగాలు చేసి తమ ఇంటిలోనే బోన్సాయి మొక్కల గ్యాలరీని ఏర్పాటు చేశారు. తాను తయారు చేసే మొక్కలకు పనికి రాని వస్తువులను కుండీలుగా మార్చి అందంగా తీర్చిదిద్దుతున్నారు.


జెడ్ మొక్క

ఎలా చేస్తారంటే..

సాధారణ మొక్కలను పరిశీలిస్తూ ప్రత్యేక పోషణతో ఆరునెలలు పెంచుతారు. అక్కడి నుంచి వేళ్లు పెరుగుతాయిగానీ మొక్క ఆకారం పెరగకుండా చిన్నదిగా ఉండేలా వాటిని కటింగ్ చేస్తూ రూపొందిస్తున్నారు.

నాతో మాట్లాడతాయి

– ఉమాశంకర్, తెలుగు ఉపాధ్యాయులు

మొక్కలపై పరిశోధనలు చేయడమంటే ఎంతో ఇష్టం. దాదాపుగా 20 ఏళ్లగా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నా. మొక్కలు నాతో మాట్లాడేలా మనసు పంచుకుంటున్నాను. బోన్సాయి మొక్కలు పెంపకంతో నాకు సంతృప్తి, ఆనందం కలుగుతోంది.

అవగాహన

బోన్సాయి మొక్కలను పెంచడమే గాదు వాటిని ఎదిగేలా చూడాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉమాగంధర్వ్ అనే యూట్యూబ్ ఛానల్‌ను నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారు. బోన్సాయి మొక్కలపై అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. ఆ ఛానల్‌కు ఇప్పటికే వేలాది మంది వీక్షకులుండటం విశేషం. ఎప్పటి నుంచో ప్రత్యేక అభినందనలు అందుకుంటున్నారు.

కుక్క అడ్డు రాగా.. తప్పించబోయి బోల్తా పడిన కారు


దెబ్బతిన్న కారు

వింజమూరు, న్యూస్‌టుడే: కారులో వేగంగా వెళుతున్నారు. హఠాత్తుగా కుక్క అడ్డు వచ్చింది. దీన్ని తప్పించబోగా అదుపుతప్పింది. పక్కనే ఉన్న కంకర గుట్ట ఎక్కింది. ఆపక్కనే విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. పల్టీలు కొట్టే క్రమంలో డోరు ఊడిపోయి అందులో ఉన్న వ్యక్తి రోడ్డుపై పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈవిషాద ఘటన కావలి- ఉదయగిరి రోడ్డులో మండలంలోని బొమ్మరాజుచెరువు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రమైన కడపలోని ఎన్జీవో కాలనీకి చెందిన ఇల్లూరు శ్రీకాంత్‌రెడ్డి, పెండ్లిమర్రికి చెందిన కె.రామసుబ్బారెడ్డి (35) కావలికి కారులో వచ్చారు. పట్టణంలో పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని బొమ్మరాజుచెరువు సమీపంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయారు. ఈక్రమంలో పక్కన ఉన్న కంకర గుట్ట ఎక్కిన కారును అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. విద్యుత్తు స్తంభాన్ని కూడా ఢీకొంది. డోర్ ఊడిపోయి ముందు సీటులో ఉన్న రామసుబ్బారెడ్డి కింద పడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సీటు బెల్ట్ పెట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న ఇల్లూరు శ్రీకాంత్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని శవ పంచనామాకు ఆత్మకూరుకు తరలించారు. మృతుడు రామసుబ్బారెడ్డికి భార్య రాజేశ్వరి, కుమారుడు జీవాన్స్, కుమార్తె లతిక ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా అమరేంద్రనాథ్‌రెడ్డి


అమరేంద్రనాథ్‌రెడ్డి


రాము

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నెల్లూరు బ్రాంచి అధ్యక్షుడిగా డాక్టర్ సి. అమరేంద్రనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. నెల్లూరు మెడికల్ సొసైటీ ఛైర్మన్‌గా డాక్టర్ వై. రాములు నియమితులయ్యారు. గురువారం జరిగిన ఐఎంఏ కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా వీరిని ఎన్నుకున్నారు. ఏడాది పాటు పదవుల్లో కొనసాగనున్నారు. ఐఎంఏ ద్వారా ప్రజలకు చేరువై వారికి వైద్యపరంగా సేవలందిస్తామని, సంఘ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

దసరా సెలవుల్లో తరగతులు తగదు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించొద్దని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆమె నగరంలోని వివిధ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఒత్తిడిలేని విద్యను అందించాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని ఇప్పటికే అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో జీసీడీవో మమత, చైల్డ్ ప్రొటక్షన్ అధికారిణి సమత పాల్గొన్నారు.

నూరు రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక


మాట్లాడుతున్న గృహనిర్మాణ సంస్థ పీడీ వేణుగోపాల్

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల ఎంపికను నూరు రోజుల్లోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ టి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల ఎంపిక కోసం ఉదయం 9గంటల లోగా వారి గృహాలకు వెళ్లాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో ఇప్పటి వరకు లబ్ధిదారులు ఎన్ని గృహాలు నిర్మించుకున్నారు? ఆయా గృహాలు ఏ స్థితిలో ఉన్నాయో అన్న విషయాన్ని పక్కాగా సమాచారం తీసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వంలో గుత్తేదారుడితో ప్రమేయం లేకుండా నేరుగా ఇళ్లు నిర్మించుకోదలచిన లబ్ధిదారులను గుర్తించి 2025 మార్చి 31లోగా ఇళ్లను నిర్మించుకునేందుకు చర్యలు తీసుకోవాలని వివరించారు. సమావేశంలో జిల్లాలోని ఆయా మండలాల డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళా నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ వైకేఆర్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోవూరు, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆత్మకూరు, వీఎస్‌యూ కాకుటూరులో మూడుచోట్ల ఉదయం 10.30గంటల నుంచి శుక్రవారం జాబ్ మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఎం. వినయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 9కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అవసరాలకు సరిపడా ఇసుక సిద్ధం: కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్) : జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఛాంబరులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా ఇసుక సిద్ధంగా ఉందని, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. త్వరలోనే ఓపెన్ రీచ్‌లు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, మైనింగ్ డీడీ చంద్రశేఖర్, సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు, ఆర్డీవోలు చందన, మాలోల పాల్గొన్నారు.

ఏజెంట్లను నియమించుకోవాలి

నెల్లూరు(టౌన్) : జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరి రివిజన్ 2025లో భాగంగా ఈనెల 29న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురిస్తానని తెలిపారు. వాటిపై నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని, డిసెంబరు 24 లోపు అభ్యంతరాలను పరిష్కరించి, 2025 జనవరి ఆరో తేదీ తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారని వివరించారు. సమావేశంలో డీఆర్వో లవన్న, తెదేపా, వైకాపా, కాంగ్రెస్, భాజపా, బీఎస్పీ ప్రతినిధులు పాల్గొన్నారు.


కరవు సీమకు కొత్త వెలుగు

మూడు జాతీయరహదారులతో మహర్దశ



కరవు ప్రాంతం.. పైగా మారుమూల. ఇటీవల వరకు సరైన సరైన రహదారి వ్యవస్థ లేని పరిస్థితి. వెనుకబాటుకు గురైంది. ఉద్యోగులు కూడా ఇక్కడికి రాని స్థితి. ఈ మాటలు మారబోతున్నాయి. కొత్తగా జాతీయరహదారులు ఏర్పాటుకానున్నాయి. దీంతో ఈప్రాంతం దశ మారుతోంది. అభివృద్ధికి బాటలు పడనున్నాయి. ఇదీ సీతారామపురం ప్రాంతంలో పరిస్థితి. - న్యూస్‌టుడే, సీతారామపురం

గ్రీన్‌ఫీల్డ్ హైవే



విజయవాడ- బెంగళూరు నగరాల మధ్య దూరాన్ని, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు నిర్మిస్తున్న ఆరువరుసల రహదారి ఏర్పాటుచేస్తున్నారు. దీన్ని మార్టూరు సమీపంలోని ముప్పవరం నుంచి బెంగళూరు వరకు 343.240 కి.మీ మేర నిర్మించనున్నారు. 14ప్యాకేజీలుగా విభజించి నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈరహదారి జిల్లాలో సీతారామపురం మీదుగా 16 కి.మీ మేర వెళుతోంది. ఇప్పటికే అటవీ శాఖ నుంచి 28.09 హెక్టార్ల భూమిని సేకరించారు. అందుకు ప్రతిగా భూమిని అటవీ శాఖ అధికారులకు ఇచ్చారు.

167 బిజీ జాతీయ రహదారి

కావలి నుంచి సీతారామపురం వరకు రూ.600 కోట్లతో 107.2 కిలోమీటర్ల మేర 167 బీజీ జాతీయరహదారి నిర్మిస్తున్నారు. 70శాతం మేరకు పూర్తయ్యాయి. గ్రామం నుంచి దుత్తలూరు కూడలి వరకు 36.4 కిలోమీటర్ల వరకు ఒక పనిగా, ఈ గ్రామ శివారు 36.4 కి.మీ నుంచి 107.2 కి.మీ వరకు రెండో పనిగా విభజించి చేస్తున్నారు. మండలంలో దాదాపు 14 కిలోమీటర్ల మేర ఈ మార్గం వెళుతోంది. ఇవి వేగంగా నిర్వహిస్తున్నారు. దీని నిర్మాణంలో భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి దాదాపు 70 శాతానికి పైగా పరిహారం నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



రాయలసీమకు అనుసంధానం

వైఎస్సార్ జిల్లా మైదుకూరు నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు 189 కిలోమీటర్ల మేర రూ.850 కోట్లతో 167 బి జాతీయరహదారి ఏర్పాటుచేస్తున్నారు. దీన్ని నాలుగు భాగాలుగా విభజించి చేస్తున్నారు. సీతారామపురం మండలంలో ఈరహదారి 18 కిలోమీటర్లమేర పోతోంది. మైదుకూరు నుంచి వైఎస్సార్ జిల్లా సరిహద్దు వరకు 59 కి.మీ, అక్కడి నుంచి ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం వరకు 41 కి.మీ, సీఎస్ పురం నుంచి మాలకొండ వరకు 44 కి.మీ, మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు 45 కి.మీ నిర్మించేలా ప్యాకేజీలుగా విభజించారు. మండలంలో వేగంగా సాగుతున్నాయి.



ట్విన్స్.. క్రీడల్లో అదుర్స్

రగ్బీలో రాణిస్తున్న గ్రామీణ ప్రాంత యువతులు


కవలలు ఝాన్సీ, శిరీషా

న్యూస్‌టుడే, పొదలకూరు

రూపంలోనే కాదు అభిరుచులు... అలవాట్లలో వారిద్దరు ఒక్కటే... లక్ష్యం విధించుకొని చదువుతో పాటు క్రీడల్లో సత్తాచాటుతున్నారు... దృఢ సంకల్పంతో రగ్బీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.. మరిన్ని పతకాలు సాధించి ప్రభుత్వ కొలువులు సాధిస్తామని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు.... ఆసక్తి ఉంటే పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు.. గ్రామీణ ప్రాంత యువతులు అవకాశాలు సద్వినియోగం చేసుకొని దూసుకెళుతున్నారు.

పొదలకూరు పట్టణంలోని మస్తాన్‌రెడ్డి నగర్‌కు చెందిన చెరుకూరు ప్రసాద్, శాంతమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. తొలి కాన్పులో కుమార్తె జన్మించగా, రెండో కాన్పులో ఇద్దరు కుమార్తెలు కవలలు జన్మించారు. పెద్ద కుమార్తె జ్యోతికి వివాహమైంది. కవలలైన ఝాన్సీ, శిరీషా చిన్నతనం నుంచి చదువుతూనే క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు. మగ పిల్లలు లేరని దిగులు పడకుండా తల్లిదండ్రులు కుమార్తెలకు ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. పొదలకూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు విద్యనభ్యసించారు. కాకతీయ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం ఝాన్సీ ఫిజియో థెరపీ చేస్తుండగా, శిరీషా బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది.

అవకాశాలు సద్వినియోగం చేసుకొని...

ఇంటర్మీడియట్ చదువుతూనే రగ్బీ క్రీడపై వారిద్దరికి మక్కువ కలిగింది. ఇంటి సమీపంలో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీధర్, రగ్బీ క్రీడా సంఘం బాధ్యులు రమేశ్ వీరిద్దరిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడల్లో పాల్గొని రాణించారు. అనంతరం నెల్లూరు, మచిలీపట్నం, పుత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. గతేడాది డిసెంబరులో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున పాల్గొని సత్తాచాటారు. అవకాశాలు సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయిలో మరింత మెరుగ్గా రాణించి పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నారు.

ప్రభుత్వ కొలువులే లక్ష్యం...

రగ్బీ క్రీడాకారిణులు ఝాన్సీ, శిరీషా మాట్లాడుతూ.. తల్లిదండ్రుల సహకారంతోనే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నామన్నారు. వారిపై భారం కాకుండా క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యమని తెలిపారు. చదువు చెప్పిన అధ్యాపకులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతో సహకారమందించారన్నారు.

5,6 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ మూసివేత

నెల్లూరు (రవాణా) : నగరంలోని పొట్టి శ్రీరాములు బస్టాండులో విద్యార్థులకు సంబంధించి ఉన్న ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్ ఈ నెల 5, 6 తేదీల్లో పనిచేయదని రెండో డిపో మేనేజర్ శివకేశ్ యాదవ్ ప్రకటనలో పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా మూసి వేస్తున్నామని, సోమవారం నుంచి యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,297
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,375
వెండి గ్రాము :	రూ. 96.40

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	113
రిటైల్	135
లేయర్	110
బ్రాయిలర్స్	196
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	223
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	123
లేయర్	110
బ్రాయిలర్స్	222
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	248
లేయర్ మాంసం	187

లింగనిర్ధారణ పరీక్షలు నేరం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవద అన్నారు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, వారి బంధువులు పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని అడగకూడదన్నారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించి ప్రతి నెలా స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

సీపీఎం నూతన కమిటీ ఏర్పాటు

దగదర్తి, న్యూస్‌టుడే: దగదర్తి, అల్లూరు మండలాల ఏరియా కమిటీని ఏర్పాటు చేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ కన్వీనర్‌గా గోపసాని రమేష్, సభ్యులుగా భాస్కర్, విజయలక్ష్మి, వెంకయ్య, మాల్యాద్రి, కాలేషాను ఎంపిక చేశామన్నారు.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

5న బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 5వ తేదీ ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్‌జూనియర్ బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు పీడీ టి.సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలన్నారు.





ఉదయగిరి: బాల త్రిపుర సుందరీదేవిగా సీతారామపురం : సిద్ధేశ్వరి అలంకారంలో ఇష్టకామేశ్వరీదేవి.. వింజమూరు: అన్నపూర్ణాదేవిగా




కావలి : పాతూరు శివాలయంలో.. వరికుంటపాడు: శైలపుత్రి అలంకారంలో



కందుకూరు : పూజా కార్యక్రమాల్లో భక్తులు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: దసరా నవరాత్రుల వేడుకలు గురువారం వాడవాడలా ప్రారంభమయ్యాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేక అలంకారం చేశారు. పూజలకు భక్తులు బారులుతీరారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

పట్టణం.. దాహం.. దాహం



ఇది పట్టణంలోని బాపూజీనగర్ కాలనీ పార్కులో అమృత్ పథకంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పైపు. దీన్ని పైపులైన్‌కు అనుసంధానం చేస్తే అమృత్ పథకంలో భాగంగా కావలి వాసులకు నీరందుతుంది.

ఇవి ఉత్తర జనతాపేటలో ఇటీవల పైపులైనుకు తవ్విన గుంత. ఆప్రాంతంలో ఇంటి ముందు నీటి వాల్వు ఉండడంతో వారు అభ్యంతరం తెలిపారు. దీన్ని మరో చోటకు మార్చడంతో చాన్నాళ్లుగా అక్కడి వారికి నీరు అందడం లేదు.



● అమృత్ పనులు ఎప్పటిలోగా పూర్తి చేసి పథకాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగిస్తారు
- మూడున్నర నెలల క్రితం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

● సెప్టెంబరు నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేసి అప్పగిస్తాం:
- ప్రజారోగ్య అధికారులు

కావలి, న్యూస్‌టుడే

ఈ గమ్యం ముగిసింది. పథకం పనులు పూర్తికాలేదు. పురపాలక సంఘానికి అప్పగించలేదు. తాగునీటి సమస్య తీరడం లేదు. మరోవైపు పాత పైపులైన్లు ఉన్న ప్రాంతాల్లో తరచూ ఎక్కడో ఒకచోట మరమ్మతులు చోటు చేసుకుంటున్నాయి. వీటిని అమర్చి మూడు దశాబ్దాలు దాటుతుండడంతో కాలం చెల్లి లీకుల బెడద వెంటాడుతోంది. వీటికి మరమ్మతుల నిమిత్తం రోజుల తరబడి సరఫరా నిలిపివేస్తున్నారు. లీకులు సంబంధించిన మెటీరియల్ స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో పరిష్కార చర్యల్లో జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో జనం నీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు.



ట్యాంకరుతో సరఫరా

ట్యాంకర్లతో ఇస్తున్నా..

పట్టణంలో పైపులైన్లు లేని ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాపై నిత్యం వివాదాలు నెలకొంటున్నాయి. వీటికి రూ. లక్షల్లో చెల్లిస్తున్నారు. ఇది మున్సిపాలిటీకి ఆర్థిక భారంగా మారింది. ప్రస్తుతం ఉత్తర జనతాపేట, ఎస్సీ కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పదో వార్డుకు ట్యాంకర్లు సరిగా రావడం లేదని ఆ ప్రాంతవాసులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయమై కావలి పురపాలక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సాయిరాం మాట్లాడుతూ తాజాగా అన్ని సమస్యలను కొలిక్కి తీసుకొస్తున్నామన్నారు.

మొఘల్ సలీంబేగ్, ఉత్తర జనతాపేట



మా ప్రాంతంలో అయిదు రోజులకు ఓసారి నీరు ఇస్తున్నారు. నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. పురపాలక అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: స్థానిక తెట్టు రహదారిల సినిమా హాలు నుంచి మామిడి చెట్ల వరకు వీధి దీపాలు వెలగడం లేదు. - **పి.శ్రీనివాసులు**
సమాధానం : పరిశీలించి వెలిగించేలా.. చర్యలు తీసుకుంటాను. - **మహేశ్, పంచాయతీ కార్యదర్శి, - గుడ్లూరు**

? మా గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిల్వ కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. - **రవి, గమళ్లపాలెం**
✓ పంచాయతీ పాలకులతో మాట్లాడి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - **చంద్రశేఖర్, ఎంపీడీవో - జలదంకి, న్యూస్‌టుడే**

? దగదర్తిలోని పాతూరుకు నీరు సక్రమంగా అందడం లేదు. - **నాగయ్య, దగదర్తి**
✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- **ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి - దగదర్తి**

? మా గ్రామంలో తాగునీరు సక్రమంగా రావడం లేదు. - **పోలయ్య, పడమర గోగులపల్లి**
✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- **పెంచల్ వీరేంద్ర, ఈవోపీఆర్డీ - అల్లూరు**

? పొదుపు మహిళల సమాఖ్యలో రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న మమ్మల్ని తొలగించారు. ఈ విషయమై మెప్మా అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదు. - **బాధిత మహిళలు**
✓ రిసోర్స్ పర్సన్ల నియామకాల వ్యవహారం మెప్మా పీడీనే చూస్తుంటారు. - **శ్రావణ్‌కుమార్, కమిషనర్, - కావలి, న్యూస్‌టుడే**

? అయ్యవారిపల్లె ఎస్సీకాలనీప్రధాన రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - **కోటయ్య**
✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.
రవి, కార్యదర్శి, న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

ఈ చెట్టు భలే ఉందే!



ఈ చిత్రం చూశారా! ఇదేమిటీ ఈ చెట్టు ఇలా ఉందనుకుంటున్నారా.. అయితే తప్పులో కాలేసినట్లే. ఇది ఓ తీగజాతి మొక్క. నిరుపయోగంగా ఉన్న మార్ పీటీ (టెలిఫోన్ టవర్)ని అల్లుకుని ఏపుగా పెరిగి చెట్టుగా కనిపిస్తోంది. మండలంలోని గుండుపల్లి పంచాయతీ కార్యాలయం వెనుకవైపు ఏర్పాటుచేసిన దీనికి ఇలా అల్లుకుంది. రహదారి పక్కనే ఉండడంతో ఈమార్గంలో వెళ్లే వారు చూసి ఈ చెట్టు భలే ఉందే అనుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, సీతారామపురం,**

కుళాయిల నిర్వహణ ఇలాగేనా?

గ్రామంలోని గోగులపల్లి రోడ్డులో ఉన్న కాలనీలో వీధి కుళాయిల నిర్వహణ సక్రమంగా లేదు. అక్కడక్కడా విరిగిపోయాయి. దీంతో నీరు వదిలినప్పుడు వృథాగా పోతోంది. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా బాగు చేయిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, అల్లూరు**



పనిచేయని మోటారు.. ప్రజలకు నీటి కష్టాలు



మండలంలోని తమిదపాడులో తాగునీటి పథకం మోటారు మరమ్మతులకు గురవడంతో గ్రామస్థులు తాగునీటికి కటకటలాడుతున్నారు. మూడు చోట్ల బోర్లు వేసి ఊరంతా సరఫరా చేస్తున్నారు. నీరు అధికంగా వచ్చే ముఖ్యమైన బోరు మోటార్ కాలిపోవడంతో సమస్య ఉత్పన్నమైందని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వింజమూరు**

ఇదేమి గ్రామసభ!



గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామ ప్రజలను భాగస్వాములుగా చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేస్తున్న గ్రామసభలు వెలవెలబోతున్నాయి. మండలంలో పెద్ద పంచాయతీ బ్రాహ్మణక్రాకలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభ తూతూమంత్రంగా జరిగింది. గ్రామస్థులు ఎవరూ రాలేదు. జిల్లా అధికారులు స్పందించి గ్రామస్థుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. **- న్యూస్‌టుడే, జలదంకి**

బొమ్మల కొలువు భలే.. భలే!



రాజా వీధిలోకి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో దసరా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీబాలాత్రిపుర అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. బొమ్మల కొలువు భక్తులను ఆకట్టుకుంది. డాక్టర్ రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ ఆనందసాగర్ కుటుంబసభ్యులు పూజలు, అన్నదాన కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. **- న్యూస్‌టుడే, బిట్రగుంట**

వంతెన ఏర్పాటు చేయాలని వినతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు నుంచి కొండముడుసుపాలెం మధ్యలో ఉన్న ఎర్రవాగు సమీపంలో జాతీయరహదారిపై వంతెన లేదా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని సీపీఎం కందుకూరు పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో జాతీయరహదారి కూడలి ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. నాయకులు మున్వర్‌సుల్తానా, రామ్మూర్తి, పద్మ, మల్లిక, వెంకట్రావు, రాయుడు, గౌస్ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



చెరువు కాదు... రహదారే

గుడ్లూరు, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షం పడినా.. గుడ్లూరు గ్రంథాలయం వద్ద అడుగుమేర నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు మిట్టపాలెం మార్గానికి ప్రవహించే వీల్లేకపోవడంతో లోయర్ ఉప్పుటేరు సప్లయ్ ఛానెల్‌కు చేరుతోంది. దీంతో స్థానిక చెరువు నిండేందుకు ఎక్కువ రోజులు పడుతోందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ప్రధానవీధిలో నీరు.. మురుగుతో కలిసి నిలిచిపోవడంతో దోమలు పెరిగేందుకు కారణమవుతోందని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రిన్సిపల్‌కు డాక్టరేట్ ప్రదానం

ఉదయగిరి, న్యూస్‌టుడే : స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ఆకుల నరసింహులుకు అల్వార్ సన్‌రైజ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు గురువారం ఆయన తెలిపారు. బయో మెడికల్ అప్లికేషన్ ఆఫ్ ఫైబర్ ఆప్టిక్స్ సెన్సార్స్ ఇన్ ఇమేజింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ పూరానాయక్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందజేసినట్లు తెలిపారు. ఆయన్ను అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

లింగసముద్రం : అంగేకులపాడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో కె.శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం దస్త్రాలను పరిశీలించి కేంద్రం నిర్వాహకురాలకు పలు సూచనలు చేశారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి : ఉదయగిరి ఎక్సైజ్ సర్కిల్ సీఐగా టి.లక్ష్మణస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రమణమ్మ ఆత్మకూరుకు బదిలీ కావడంతో ఆ స్థానంలో కావలిలో పనిచేస్తున్న లక్ష్మణస్వామిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, సారా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీడీవో కృషి మరువలేనిది

బిట్రగుంట : బోగోలు మండలాన్ని అభివృద్ధి చేసేందుకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సుబ్బారావు చేసిన కృషి మరువలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. కొడవలూరుకు బదిలీపై వెళ్లిన ఆయన్ను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది సత్కరించారు. ఏవో గోవిందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జహీర్ తెదేపా నాయకులు ఎం.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులు మేలు

సీతారామపురం : రైతులు సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలని ఉదయగిరి ఇన్‌ఛార్జి ఏడీఏ చెన్నారెడ్డి సూచించారు. సీతారామపురం-1, 2 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వెటర్నరీ సహాయకురాలు మాలాశ్రీ, ఏఎంసీ సహాయకుడు చిరంజీవి, వీఏఏ హజీరాబేగం, ఎంపీఈవో వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో అభివృద్ధి

కందుకూరు గ్రామీణం : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులతో గ్రామాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పలుకూరు, మోపాడు, కొండముడుసుపాలెం, మాచవరం గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. అవసరమైన పనులను గుర్తించి వాటిని ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. ఏపీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

పనుల గుర్తింపు

లింగసముద్రం : మండలంలోని అన్నేబోయినపల్లి, అంగిరేకులపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన గ్రామ సభలను గురువారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన పనులను గుర్తించినట్లు ఎంపీడీవో కె. శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

వీఆర్వోల బదిలీ

వలేటివారిపాలెం : మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల పరిధిలోని వీఆర్వోలు బదిలీ అయ్యారని తహసీల్దార్ అమీద్ తెలిపారు. సాధారణ బదిలీలో భాగంగా నూకవరం, కొండసముద్రం, నలదలపూరు, నేకునాంపురం గ్రామాల వీఆర్వోలతోపాటు ఉపతహసీల్దారు విజయభాస్కర్ పామూరుకు బదిలీ అయినట్టు ఆయన తెలిపారు.

కేసు కొట్టివేతతో సంబరాలు

కావలి, : తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊసా వెంకట్రావు తదితరులపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కొట్టివేతతో ఆ పార్టీ శ్రేణులు గురువారం సంబరాలు నిర్వహించాయి. నెల్లూరు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయస్థానంలో వీరిపై నమోదైన కేసును కొట్టివేశారు. అప్పట్లో వైకాపా నాయకుడు పరసు మాల్యాద్రి, తదితరులు వారిపై కుల దూషణకు సంబంధించిన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

ప్రజల సహకారం మరువలేనిది: ఆర్డీవో

కావలి : గత మూడు సంవత్సరాల మూడు నెలల కాలంలో కావలి వాసులు తనకు అందించిన సహకారం మరువలేనిదని ఆర్డీవో శీనానాయక్ అన్నారు. గురువారం పట్టణంలో ఆయనకు వీడ్కోలు సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 80 మంది ఆర్డీవోలుగా విధులు నిర్వహిస్తే ముగ్గురు మాత్రమే మూడేళ్లకుపైబడి పనిచేశారన్నారు. వారిలో నేనూ ఉన్నానన్నారు.

పాతకక్షలతో దాడి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ముసునూరు రాఘవేంద్ర కాలనీలో పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై దాడి చోటుచేసుకుంది. గురువారం కొండూరు అరవిందబాబుపై నితీష్‌రెడ్డితోపాటు మరో నలుగురు దాడి చేశారు. బాధితుడు వారి నుంచి తప్పించుకుని స్థానికుల సహాయంతో కావలి ప్రాంతీయాసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలంలోని కడనూతల సమీపంలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. బిట్రగుంట ఎస్సై కథనం మేరకు.. తిరుపతి నుంచి ఏలూరు వెళ్లే కారును ఎదురుగా రాంగ్ రూట్‌లో వెళ్లే ఆటో ఢీకొంది. ఈ ఘటనలో కడనూతలకు చెందిన ఆటోడ్రైవర్ నాటకరాణి సురేష్, అందులో ఉన్న అన్నపురెడ్డి రాధయ్య గాయపడ్డారు. కారు నడుపుతున్న రామచంద్రారావు, అందులో ప్రయాణిస్తున్న ఓ బాలుడికి గాయాలయ్యాయి. వీరు కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు పరికరాల చోరీ

జలదంకి, న్యూస్‌టుడే : పొలాల్లోని విద్యుత్తు నియంత్రికలు, మోటార్ల తీగలను దొంగలు చోరీ చేస్తున్నారు. మండలంలోని బ్రాహ్మణక్రాక, గట్టుపల్లి, బి.కె.అగ్రహారం తదితర గ్రామాల్లో ఈ దొంగతనాలు జరిగినట్లు కె. రాధాకృష్ణ, ఎల్.దశయ్య, కొండపనాయుడు తదితరులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ ఎస్సై రమణయ్య తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో విక్కిరాలపేట, పాలూరు దొండపాడు రహదారుల్లో తనిఖీలు చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎవరైనా అక్రమ తవ్వకాలు చేస్తూ తరలిస్తుంటే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

దారి విషయమై దాడి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామ్మూర్తిపేటలో ఇళ్ల నడుమ ఉమ్మడి దారి విషయమై నెలకొన్న వివాదం మహిళపై దాడికి దారితీసింది. బాధిత మహిళ వేముల పద్మ పొరుగింటి వారైన బొడ్డు పార్వతి, యశోధ, మహేష్‌సింగ్‌పై ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ ఎస్సై ఎస్. సుమన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



కాటాలు వేస్తున్న రైతులు

ధాన్యం బస్తా రూ.1800

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎడగారు పంట రైతుల ఆశలను చిగురించేలా చేస్తుంది. మండలంలోని మాచవరం, శ్రీరంగరాజపురం, మోపాడు గ్రామాల్లోని సుమారు 400 ఎకరాలకు పైగా ఎడగారు వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతల దశలో ఉంది. వరికోత యంత్రాలతోపాటు ధాన్యం తూకాలు వేసే కూలీల సందడితో శ్రీరంగరాజపురం కొత్తరహదారి రద్దీగా మారింది. ధాన్యం బస్తా రూ.1800ల వరకు ధర పలుకుతుంది. ధాన్యం తరలించేందుకు రోజుకి సుమారు పదుల సంఖ్యలో లారీలు వస్తూపోతూ ఉన్నాయి. చెరువులో నీరు లేకున్నా మోటర్ల ద్వారా రైతులు సాగు చేసి ఎకరాకి సుమారు 40 బస్తాలకు పైగా పండించారు. వీరికి తగిన ధర లభిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పొలంబాటలో అధికారులు.. ఉపయోగించుకుంటే సిరులే!



దుత్తలూరులో సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

గత వైకాపా ప్రభుత్వ పాలనలో రైతులకు అందించాల్సిన రాయితీ పరికరాల పంపిణీ నిలిచిపోయింది.. భూసార పరీక్షలను ఆపేశారు.. ఆ పార్టీ నాయకులుగా ఉన్న కమిటీ సభ్యులకే రాయితీ పరికరాలను అందించారు.. జగన్ సర్కార్ రైతు సంక్షేమాన్ని విస్మరించింది. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయంపై దృష్టి సారించింది. అన్నదాతలకు ఆసరాగా నిలవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, సేంద్రియ, మార్కెటింగ్, మత్స్య శాఖల అధికారులను రైతుల వద్దకే పంపిస్తోంది. పొలం పిలుస్తోంది పేరిట ప్రతి మంగళ, బుధవారాల్లో అధికార యంత్రాంగం రైతుల దగ్గరకే వెళ్లేలా రూపొందించిన ఈ కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే 152 గ్రామాల్లో అధికారులు నిర్వహించి రైతులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో 38 మండలాలుండగా 722 పంచాయతీలున్నాయి. 561 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో అధికంగా వరి రైతులు సాగు చేస్తుంటారు. కొన్ని మండలాల్లో పొగాకు, మినుము, పత్తి, శనగ వేస్తారు. వాతావరణం అనుకూలించక అన్నదాతలకు సాగు భారంగా మారింది. ఈక్రమంలో నూతన విధానాల వైపు మళ్లించి వ్యయం తగ్గించి ఆశించిన ఫలితాలను సాధించడమే ముఖ్య లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఇందుకోసం ప్రాంతాలవారీగా అవసరమైన సూచనలు చేయడం, భూసార పరీక్షలు నిర్వహించేలా ప్రోత్సహించడం ఆయా శాఖల అధికారులు చేస్తున్నారు. ఎరువుల పిచికారీకి డ్రోన్ల వినియోగం, కౌలు రైతుల కార్డుల మంజూరు, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు వంటి విషయాలపై ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పిస్తూ రైతుల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించేలా మార్గదర్శకాలు వెలువడ్డాయి. వాస్తవంగా ఈ కార్యక్రమం గత నెల 10వ తేదీ ప్రారంభం కావాల్సి ఉండగా విజయవాడలో సంభవించిన వరదలతో గత నెల 24 నుంచి ప్రారంభమైంది.

లోపాలు గుర్తించి..

పంటల్ని పరిశీలించి చీడ పీడల్ని గుర్తించి నివారణ చర్యలు వివరిస్తున్నారు. దిగుబడులు తగ్గడానికి కారణాలు విశ్లేషించి చర్యలు తీసుకోవడంతోపాటు సూక్ష్మ పోషకాల లోపాల్ని గుర్తించి భూసారం పెంచేలా సూచనలు ఇస్తున్నారు. తుంపర, బిందు సేద్యం విధానాలు ఆచరించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడం లాంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

అన్నదాతలకు ఉపయుక్తం :

సత్యవాణి, జిలా వ్యవసాయాధికారిణి

జిల్లాలో రైతులకు ఉపయుక్తంగా ఉండేలా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. పెట్టుబడులు తగ్గించి, ఆదాయం పెంచేందుకు తోడ్పాటు అందిస్తున్నాం. ఆధునిక సేద్యాన్ని అన్నదాతలకు చేరువ చేస్తున్నాం. వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పొలంబాట పట్టడంతో సాగులో ఉత్తమ ఫలితాలు రాబోయే రోజుల్లో చూడబోతున్నాం.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కలిగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడంతో ఉద్యోగ జీవితంలో చేసిన కృషి, పొందిన మన్ననలు జీవితాంతం గుర్తుంటాయని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాత్వా) ఉదయగిరి నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక కలిగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం జరిగింది. నియోజకవర్గ కమిటీ గౌరవాధ్యక్షులుగా గుండా రవిబాబు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శిగే కొండయ్య, గాండ్ల బాల వెంకయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా నట్టే నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా నున్న దామోదరం, ఉపాధ్యక్షులుగా కదిరి కాంతారావు, పాపిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా ఎ.ప్రసాద్, సి.హెచ్. వెంకటరమణయ్య, మహిళా కార్యదర్శిగా కర్తన అరుణ ఎన్నికయ్యారు. జిల్లా ప్రతినిధులుగా డి.వి.రామ్మోహన్, ఎ.సూర్యప్రకాష్‌రావు, జి.వెంకటసుబ్బయ్య, ఎన్.శ్రీనివాసులు ఎంపికైనట్లు ఎన్నికల అధికారి కమతం సుబ్బారావు తెలిపారు. అంతకుముందు నియోజకవర్గంలోని 8 మండలాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కాత్వ ఉపాధ్యాయుల సన్మానించారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

వాణిజ్య పంటలు లాభదాయకం

చేజర్ల, తోటపల్లిగూడూరు, మనుబోలు, ముత్తుకూరు, ఆత్మకూరు, ఎ.ఎస్.పేట : తక్కువ పొలంలో ఎక్కువ రాబడినిచ్చే వాణిజ్య పంటలను రైతులు సాగు చేయాలని వ్యవసాయాధికారి వి.శశిధర్ సూచించారు. చిత్తలూరు, ఆదూరుపల్లిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగులో సందేహాల గురించి రైతులకు సూచనలు చేశారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో శిరీషారాణి పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి, వెంకన్నపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ముత్తుకూరులో అధికారులు మాట్లాడుతూ రబీకి అనువైన వరి రకాలు, విత్తన శుద్ధి గురించి వివరించారు. ఆత్మకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ దేవసేన పాల్గొన్నారు. కొండమీద కొండూరు, కుప్పురుపాడు గ్రామాల్లో అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మనుబోలు : మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పిడూరు, కొలనుకుదురు, గురివిందపూడి, వీరంపల్లి, కాగితాలపూరు, చెర్లోపల్లి, చెరుకుమూడి, బద్దెవోలు గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వెంకటాచలం, పొదలకూరు, సైదాపురం, ఇందుకూరుపేట, చిట్టమూరు మండలాలకు బదిలీ అయ్యారని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: ఏఎస్‌పేటలోని తూర్పు వీధిలో కొంత మేర గ్రావెల్ రోడ్డు ఉంది. అక్కడ సిమెంటు రోడ్డు నిర్మించాలి. – పి.అస్లం, గ్రామస్థుడు

సమాధానం: ఇప్పటికే ప్రతిపాదనలు పంపి ఉన్నాం. నిధులు మంజూరుకాగానే రోడ్లు వేస్తాం. **– పంచాయతీ కార్యదర్శి యస్‌దానీబాషా**

? మనుబోలు చంద్రమౌళినగర్ గిరిజనకాలనీలో మురుగు నీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద అధికంగా ఉంది. – శివ, స్థానికుడు

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలను శుభ్రం చేయిస్తాం. **– చెంచుప్రసాద్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**

? విడవలూరులో దోమల బెడద అధికంగా ఉంది. మురుగు కాలువల్లో పూడిక తీయించాలి. – మహేశ్, విడవలూరు

✔ పరిశీలించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. **– దశరథరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో**



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

అనుమసముద్రంపేట: నెల్లూరులో జరిగిన ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడాపోటీల్లో పాల్గొన్న ఏఎస్‌పేట మోడల్ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి **వినయ్‌తేజ్** అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీదీప్ తెలిపారు. ఈనెలలో గుంటూరులో జరిగే ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయులు మన్మథ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఈసీకి రూ.6 వేలు అడుగుతున్నారని ఆవేదన..!

కోవూరు, న్యూస్‌టుడే: ఎవరైనా తమ ఆస్తికి సంబంధించి ఈసీ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 600 చెల్లించాలి. అయితే కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం అదనంగా రూ.6 వేలు చెల్లించాలని కోరుతున్నట్లు మండలంలోని వేగూరుకు చెందిన బాధితుడు ఏసుదాసు ఆరోపించారు. సబ్ రిజిస్ట్రార్ ఏడాది కాలంగా లేకపోవడంతో ఇలాంటివి జరుగుతున్నాయని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

సోమశిలకు 6,200 క్యూసెక్కుల వరద

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారానికి 6,200 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 53.207 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 5, పవర్ టన్నల్ ద్వారా 1500 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్ డెల్టాలైన ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 10,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

వెంకటాచలం, న్యూస్‌టుడే: ఒక గ్రామానికి చెందిన బాలిక(14)తో యువకుడు వికృత చేష్టలకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి పోక్సో కేసునమోదు చేసి విచారిస్తున్నారు.



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగులు

జ్వరమొస్తే రోగి జేబుకు చిల్లు

న్యూస్‌టుడే, కోవూరు

ఎవరికైనా జ్వరమొచ్చిందా..అయితే రూ.5 వేలు ఖర్చవుతోంది. జలుబు చేస్తే రూ.2వేలు, తీవ్రంగా జ్వరమొస్తే అప్పులు చేసి ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలోని ప్రైవేటు వైద్యులు ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రతి ఇంట్లో ఒకరు, ఇద్దరు జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు.. నిత్యం రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే సామాన్య, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యానికి గురైతే పూట గడవడం కష్టమవుతోంది. ఎలాగోలా వైద్యుడి వద్దకు వెళ్లి ఇంజక్షన్ వేయించుకుంటే పనికి వెళ్లొచ్చని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. ఈక్రమంలో చిన్నపాటి జ్వరంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే ఇదే అదనుగా వైద్యులు రక్త పరీక్షలు చేసే ల్యాబ్ నిర్వాహకులు కుమ్మక్కై వివిధ రకాల పరీక్షలు చేయిస్తున్నారు. రోగి ఒక సమస్యతో బాధపడుతుంటే అన్ని రకాల పరీక్షలు చేయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. వారు చేయించుకోకుంటే భయభ్రాంతులకు గురి చేయడంతో విధి లేక వారు చెప్పినట్లు చేయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా 80 శాతం వరకు ఫ్లూజ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయి. మాత్రలు వినియోగించడం, తగు జాగ్రత్తలు పాటిస్తే రెండు, మూడు రోజుల్లో తగ్గుముఖం పడతాయి. రోగులను రక్తపరీక్షలకు ల్యాబ్ వద్దకు పంపితే వైద్యుడికి రోగి చెల్లించిన మొత్తంలో యాభై శాతం కమీషన్ ఇస్తున్నారు. జ్వరాలకు యాంటీబయాటిక్ ఎక్కువగా వినియోగించొద్దని వైద్య నిపుణులు చెబుతున్నా.. అవే ఎక్కువ వినియోగిస్తున్నారు. జ్వరం తగ్గినా నడవలేకపోవడంతో నెల రోజుల పాటు కూలీ పనులకు వెళ్లలేక మంచానికే పరిమితమవుతున్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా రక్త పరీక్షలు రాస్తున్న వైద్యులు, ల్యాబ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసి రోగుల వద్ద జరిగే దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రక్త పరీక్షల పేరుతో ఇష్టారాజ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ

● కోవూరుకు చెందిన ఒక ఉపాధ్యాయుడికి జలుబు, జ్వరం రావడంతో స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. ఆయన పరీక్షించి సమీపంలో ఉన్న ల్యాబ్‌లో రక్తపరీక్షలు చేయించుకొస్తే మందులు రాస్తామన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర పరీక్షలు చేయించుకోవాలని చెప్పడంతో రూ.1800 తీసుకున్నారు. టైఫాయిడ్ జ్వరముందని, మిగతా పరీక్షలన్నీ సాధారణంగా ఉన్నాయని చెప్పారు. వైద్యుడు పది రోజుల పాటు ఇంజక్షన్లు వేయించుకోవాలన్నారు. దీనికి మరో రూ.2వేలు వెచ్చించారు.

● బుచ్చికి చెందిన ఒక దుకాణదారుడు మూడేళ్ల కుమార్తెకు రెండు రోజులుగా జలుబు, జ్వరంతో బాధపడుతుండగా ప్రవేట్ ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యుడిని సంప్రదించారు. ఆయన పలు రకాల రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. జ్వరం వచ్చిందని కొన్ని రోజుల పాటు ఇంజక్షన్లు వాడాలని మందులకు మరో రూ.1500 వరకు తీసుకున్నారు. చేసేదేమీ లేక వారు చెప్పినట్లు చేశారు.

కోవూరు పరిధిలో నాలుగు నెలలుగా ఆసుపత్రులకు వచ్చిన జ్వర బాధితుల వివరాలు

నెల	ప్రభుత్వ	ప్రైవేటు	మొత్తం
జూన్	250	360	610
జులై	325	658	983
ఆగస్టు	360	670	1030
సెప్టెంబరు	280	570	850

మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం

డా.విజేత, సూపరింటెండెంట్, కోవూరు సీహెచ్‌సీ

కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉచితంగా అన్ని రకాల రక్తపరీక్షలు చేస్తున్నాం. అవసరం మేరకు మాత్రమే మందులు ఇస్తున్నాం. ఎలాంటి ఖర్చులేకుండా తమ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం.

గ్రామసభ తీర్మానంతోనే ఉపాధి పనులు

మనుబోలు, న్యూస్‌టుడే: గ్రామసభ తీర్మానంతోనే ఉపాధి హామీ పనులు గుర్తిస్తామని ఏపీవో రాజమ్మ తెలిపారు. గురువారం మండలంలోని చెర్లోపల్లి, మనుబోలు, పిడూరు, గురివిందపూడి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ఏ పనులు చేయాలో వివరించారు. సర్పంచి పద్మమ్మ, ఉపసర్పంచి చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట సచివాలయంలో గ్రామసభ సర్పంచి తాజున్నిసాబేగం అధ్యక్షతన జరిగింది. గ్రామస్థులు పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలల ప్రాంతాల్లో రక్షిత నీరు సరఫరా సరిగా లేదని, మురుగుకాలువలు నిర్మించాలని, బోర్లు మరమ్మతులు చేయించాలని, సిమెంటు రోడ్లు పలు వీధులకు నిర్మించాల్సి ఉందని తెలిపారు. కేజీబీవీ పాఠశాల వద్ద ఉన్న బోరు నుంచి కొత్తగా పైపులైను వేసి నీరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో



కండలేరు జలాశయం ఎడమ కాలువ సమీపంలో నిర్మిస్తున్న స్పిల్‌వే పనులు కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయి. 68 టీఎంసీలకు పైగా నీరుంటే డేగపూడి వాగు ద్వారా సముద్రానికి పంపేందుకు స్పిల్‌వే నిర్మిస్తున్నారు. పొదలకూరు మండలం అంకుపల్లి, వావింటపర్తి గ్రామాల వద్ద రెండు భారీ వంతెనలు నిర్మించారు. అయితే స్పిల్‌వే వద్ద పనులు వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు ఎడమ కాలువ ఈఈ అనిల్ మాట్లాడుతూ.. పనులు సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

ఎందుకింత నిర్లక్ష్యం..?

ఎక్కడైతే.. విద్యుత్తు నియంత్రిక ఉంటుందో.. అక్కడ నిర్లక్ష్యం కనిపిస్తోంది అనడానికి ఉదాహరణగా నిలుస్తోంది ఈ చిత్రం. ఖాదర్‌పూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగ జాతి మొక్కలు అల్లుకుపోయాయి. పచ్చటి కొమ్మలు తీగలను తాకినప్పుడు మంటలొస్తున్నాయి. మొక్కలను తినేందుకు పశువులు వెళితే మృత్యువాత పడే అవకాశముంది. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అల్లుకున్న మొక్కలను తొలగిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)





గుంత ఆక్రమణలతో చింత

విడవలూరు మండలం రామతీర్థంలో తుపాను రక్షిత భవనం ఎదురుగా ఉన్న పీతిరి గుంత ఆక్రమణకు గురవుతోంది. వర్షాల్లో వరద నీరు ఈ గుంత ద్వారా సముద్రంలోకి కలుస్తాయి. సుమారు ఎకరాకుపైగా విస్తీర్ణం గల గుంత ప్రస్తుతం ఆక్రమణలకు గురైంది. వరద నీరు వెళ్లే వీలు లేక గృహాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. దీనిపై తహసీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశీలించి సర్వే చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

వారాహి సభకు తరలిన జనసైనికులు

తిరుపతిలో గురువారం సాయత్రం జరిగే వారాహి సభకు మేము సైతం అంటూ పొదలకూరు నుంచి జనసైనికులు తిరుపతికి తరలి వెళ్లారు. జనసేన వారాహిసభ సాక్షిగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం వారాహి డిక్లరేషన్ ప్రకటించే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపును అనుసరించి తాము తరలి వెళుతున్నట్లు జనసైనికులు అనిల్‌కుమార్, విష్ణులు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మల ప్రసాద్, శశికుమార్, బి.ప్రసాద్, వంశీ కిరణ్ కుమార్, రాజేష్, సంతోష్, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు



దేవీ నమోస్తుతే..!

శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరంభం

కోవూరు, విడవలూరు, పొదలకూరు, మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, ఆత్మకూరు, అనంతసాగరం, సంగం, బుచ్చి, సైదాపురం, రాపూరు, కలువాయి, న్యూస్‌టుడే: కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో గురువారం శరన్నవరాత్రి శోభ సంతరించుకుంది. విడవలూరులోని పీర్లచావిడి సెంటర్‌లో దాదాపు మూడు శతాబ్దాల తర్వాత దసరా ఉత్సవాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారీగా మండపం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కలశ స్థాపన జరిగింది. ఎంపీ వేమిరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. పొదలకూరులో లక్ష్మీదేవి వీరలక్ష్మీ అలంకారంలో భక్తులు పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో కలశ స్థాపన ప్రాణప్రతిష్ఠ లలితా సహస్రనామ పూజలు నిర్వహించారు. ఇనుకుర్తిలో కాంతమ్మతల్లి దేవస్థానంలో స్వర్ణదుర్గ అలంకారంలో భక్తులు దర్శనం చేసుకొన్నారు. కోవూరు పట్టణంలోని ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సైదాపురంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో గురువారం కలశస్థాపనతో వేడుకలు ప్రారంభించారు. పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు సౌభాగ్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గ్రామోత్సవం నిర్వహించారు. కలువాయమ్మకు ఉదయాన్నే పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సంగంలోని కామాక్షి దేవి సమేత సంగమేశ్వరాలయంలో గురువారం నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కాశీనాయన ఆశ్రమం నుంచి కలశాలతో కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు భక్తులు ప్రదర్శనగా వెళ్లి ఆలయంలో కలశస్థాపన చేశారు. సోమశిల సోమేశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారు భక్తులకు త్రిపుర సుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.







కోవూరు: కలశాలతో మహిళల ప్రదర్శన, జొన్నవాడలో ప్రతులు ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు.. పొదలకూరులో..









పెంచలకోన, విడవలూరు, ఆత్మకూరులో అమ్మవార్లకు అలంకారం.. సంగంలో ఆలయానికి వెళుతున్న మహిళలు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



పాటూరు– దామరమడుగు రోడ్డు దుస్థితి

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు మండలంలోని పాటూరు గ్రామం నుంచి దామరమడుగు గ్రామానికి వెళ్లేదారిలో అడుగడుగునా గుంతలు పడి ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వందలాదిమంది ప్రయాణికులు ద్విచక్రవాహనాల్లో, ఆటోల్లో రోడ్డు మీద ప్రయాణిస్తుంటారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి దామరమడుగు వైపు రోడ్డు మలుపు నుంచి ముంబయి జాతీయ రహదారి వరకు సుమారు మూడు కిలోమీటర్లు తారురోడ్డు ఉంది. రెండేళ్ల క్రితం వచ్చిన వరదల్లో రోడ్డు ధ్వంసమైంది. ఎఫ్‌డీఆర్ నిధులతో తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేసి అధికారులు మమ అనిపించారు. వర్షాకాలంలో రోడ్డంతా గుంతలలో నీరు చేరి ప్రయాణికులను, పాదాచారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుండటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ రాజ్ ఏఈ పరమేశ్వరలింగం మాట్లాడుతూ రోడ్డు నిర్మించేందుకు రూ. 60 లక్షల అంచనాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. నిధులు మంజూరవగానే పనులు చేపడతామన్నారు.

నగదు చోరీ కేసుపై విచారణ

సంగం : సంగంలో మంగళవారం కెనరా బ్యాంకులో తరుణవాయికి చెందిన సుగుణమ్మను మోసం చేసి రూ. 16వేలు అపహరించిన కేసుపై గురువారం పోలీసులు విచారణ చేపట్టారు. బ్యాంకులోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. నగదు చోరీ అనంతరం ఇద్దరు ఆగంతుకులు పరారవడాన్ని గుర్తించారు. త్వరలో నిందితులను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

బాధ్యతల స్వీకరణ

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట ఎక్సైజ్ సీఐగా జీవీ ప్రసాద్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇందుకూరుపేటలో 5, తోటపల్లిగూడూరులో 4, ముత్తుకూరులో 9 దుకాణాలు ఉన్నాయని తెలిపారు. అలాగే ఎక్సైజ్ ఎస్సైగా గుంటూరు నుంచి వచ్చిన హరిబాబు బాధ్యతలు స్వీకరించారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

ఆంజనేయస్వామి జెండా ఉత్సవం

సైదాపురం, న్యూస్‌టుడే : మండలంలోని తలుపూరులో వెలసిన ఆంజనేయస్వామి జెండా ఉత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇక్కడి ఆశ్రమంలో ఏటా ఆంజనేయస్వామి జెండా ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రక్తదాన మోటివేటర్ పెంచల పుల్లయ్యకు అవార్డు

కలువాయి : జాతీయ రక్తదాన వారోత్సవాల సందర్భంగా కలువాయి బీవీఎన్ఆర్ జడ్పీఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెంచలపుల్లయ్య జిల్లా ఉత్తమ రక్తదాన ప్రేరేపకునిగా అవార్డు అందుకున్నారు. కలువాయి, చేజర్ల మండలాల్లో ఏడాదికి నాలుగు పర్యాయాలు రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేసి 350 యూనిట్లు రెడ్‌క్రాస్ అందజేస్తుండటంతో అవార్డుకు ఎంపిక చేశారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

సిద్ధవరంలో వాగ్వాదం

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని సిద్ధవరంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం విషయంలో తెదేపా, వైకాపా నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. గురువారం సిద్ధవరం పంచాయతీ గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ నిధులతో అందరికీ అందుబాటులో ఉండేలా గ్రామం మధ్యలో సచివాలయం కొనసాగుతున్న కమ్యూనిటీ హాల్లోనే భవనం ఏర్పాటు చేయాలని వారి మధ్య వివాదం నెలకొంది.

ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు - చిట్వేలి ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి రాపూరు వైపు వస్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కోవూరుకు బదిలీ అయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

అన్నారెడ్డిపాళెం విద్యార్థులు.. సాఫ్ట్‌బాల్‌లో అదరహో



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

సంగం, న్యూస్‌టుడే: అన్నారెడ్డిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో తమ సత్తా చాటుతున్నారు. ముగ్గురు బాలలు రాష్ట్ర జట్టులో స్థానం సాధించి పలు పోటీలకు హాజరవుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మహేశ్ శిక్షణలో తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ ఈ ఏడాది జులైలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను ప్రదర్శించారు.

సైనికాధికారినవుతా.. : శివకుమార్



అన్నారెడ్డిపాళెంకు చెందిన శివకుమార్.. తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు వాణి, రవి వ్యవసాయ కూలీలు. శివకుమార్.. 14 ఏళ్ల విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో తొలి బేస్ క్రీడాకారుడిగా జిల్లా జట్టులో కీలకంగా ఉన్నారు. జులై నెలలో జిల్లా జట్టు తరఫున శ్రీకాకుళంలో ఆడారు. గతేడాది రాష్ట్ర జట్టుకి ఎంపికై ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో, గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీల్లో.. తన క్రీడా కౌశల్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు పొందారు. భవిష్యత్తులో సైనికాధికారిగా దేశానికి సేవలందించడమే తన లక్ష్యమని చెబుతున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడినవుతా



టి.సుధర్ : జండాదిబ్బకు చెందిన వ్యవసాయ కూలీ టి. సుగుణమ్మ కుమారుడైన సుధీర్ పదోతరగతి చదువుతున్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడిగా పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎదిగారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టులో రెండో బేస్ క్రీడాకారుడిగా ప్రతిభ చూపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడలపై మరింత అవగాహన పెంచేందుకు భవిష్యత్తులో వ్యాయామ ఉపాధ్యాయుడినవుతానని చెబుతున్నారు.

అంతర్జాతీయస్థాయిలో రాణిస్తా..



వెంకటభాను ప్రకాశ్ : జండాదిబ్బ గ్రామపంచాయతీ అరవపాళెం గ్రామానికి చెందిన ఎన్.హరికృష్ణ, శీనమ్మ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడైన వెంకటభానుప్రకాశ్ పదోతరగతి చదువుతున్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడపై ఆసక్తితో 17 ఏళ్లలోపు విభాగంలో జిల్లా జట్టులో క్యాచర్‌గా ఉంటూ ప్రతిభ చాటుతున్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో హాజరై తన ప్రతిభ చూపారు. అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలన్నదే తన లక్ష్యం అంటున్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

కోవూరు, విడవలూరు, పొదలకూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: రైతులు నాణ్యమైన వరి విత్తనాలను చల్లుకోవడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని కోవూరు ఏడీఏ సుజాత తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గుమ్మళ్లదిబ్బలో వరి నార్లను గురువారం పరిశీలించారు. వ్యవసాయాధికారిణి ఇందిరావతి, రైతులు శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. విడవలూరు మండలంలోని వావిళ్ల, ముదివర్తిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముదివర్తి సర్పంచి నిర్మలమ్మ, వావిళ్ల ఎంపీటీసీ సభ్యురాలు రమ, రైతులు పాల్గొన్నారు. పొదలకూరు మండలం నేదురుపల్లిలో ఉద్యానాధికారి ఆనంద్ మాట్లాడుతూ పండ్లతోటల విస్తరణ కింద నిమ్మ, మామిడి రైతులకు రాయితీల గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి ఏడుకొండలు నాయక్, వీఏఏ గోవర్ధన్, రైతులు పాల్గొన్నారు. ఇందుకూరుపేట మండలంలోని పున్నూరు, లేబూరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



గుమ్మళ్లదిబ్బలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుజాత

అనితమ్మ సేవలు అభినందనీయం

మనుబోలు, న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధికి అనితమ్మ చేసిన సేవలు అభినందనీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. మండలంలోని గురివిందపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనితమ్మ బదిలీపై వెళుతున్నారు. గురువారం గ్రామసభలో ఆమెను తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు. నాయకులు చెన్నూరు సుధీర్‌రెడ్డి, సర్వేపల్లి శివకుమార్, మోమిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

మనుబోలు, న్యూస్‌టుడే : స్థానిక కోదండరామపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, కళాకారుడు మర్రి మధుసూదన్‌రావు(84) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మనుబోలు ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. డ్రామా కళాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

మర్రిపాడు(సంగం), న్యూస్‌టుడే: దేశ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడమే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి అన్నారు. మర్రిపాడులో గురువారం రాత్రి పలు కుటుంబాలు భాజపాలో చేరాయి. రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు కె.విజయలక్ష్మి, మండల నాయకుడు డి.మనోహర్ రెడ్డి, సీహెచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం



దుస్తులు అందిస్తున్న భాజపా నేతలు

సిబ్బందికి దుస్తుల వితరణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందికి శ్రీ రంగనాథ, శ్రీ రాజ రాజేశ్వరి భక్త మండళ్ల ఆధ్వర్యంలో దుస్తుల వితరణ గురువారం జరిగింది. కార్యక్రమంలో భాజపా కిసాన్ మోర్చా జాతీయ నాయకులు సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ రెండు భక్త మండళ్లు 20 ఏళ్లుగా దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు మిడతల రమేష్, రామానందగిరి స్వామీజీ, బద్రి నారాయణ, రాంబాబు, సునీల్, మల్లికార్జున, రంగనాథ భక్త మండలి సభ్యులు రామ మోహన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీవో

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిగా నియమితులైన ఎల్.శ్రీధర్ రెడ్డి గురువారం నెల్లూరుకు చేరుకుని కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ డీపీవోగా పనిచేస్తున్న ఎం.సుష్మిత శ్రీకాళహస్తి డీఎల్‌డీవోగా నియమితులయ్యారు. నెల్లూరు డివిజన్ డీఎల్‌పీవోగా ఉన్న కె.శ్రీనివాస్ ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో నరసరావుపేట నుంచి బదిలీపై వస్తున్న డాక్టర్ రమణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జీతం బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: తనకు రావాల్సిన జీతం బకాయిలను వెంటనే చెల్లించాలని వింజమూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన కప్పా వెంకటసురేష్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. తాను కాటేపల్లి పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో తనకు ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్లిన సమయంలో పోస్టాఫీసును తనిఖీ చేసిన అధికారులు, తాను వివరణ ఇస్తున్న వినకుండా అకారణంగా కావాలని చర్యలు తీసుకున్నారని ఆరోపించారు.

పట్టణ ఖజానా ఖాళీ

ప్రగతి పనులపై ప్రభావం

జిల్లాలోని నగరపాలకసంస్థ, పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరులు పన్నులే. వీటిపైనే పట్టణాల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. గత కొన్ని నెలలుగా పన్నుల వసూళ్లు మందగించడంతో పురపాలిక ఖజానాలు ఖాళీ అవుతున్నాయి. ఇతర నిధులు కూడా విడుదల కాకపోతే పట్టణాలకు ఇబ్బందులు తప్పవు.

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)



నెల్లూరు నగరం

ఏటా ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు ఒక అర్ధభాగం, అక్టోబరు ఒకటి నుంచి మార్చి నెలాఖరు వరకు రెండో అర్ధభాగంగా ఆయా పట్టణాల్లో వార్షిక పన్నులు వసూలు చేస్తారు. ఇప్పటికే ఆర్థిక సంవత్సరంలోని అర్ధ భాగం పూర్తయింది. కొన్ని నెలలుగా ఇసుక కొరత వేధిస్తుండటంతో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న వారంతా పన్ను చెల్లింపును రెండో వాయిదాతో కలిపి చెల్లించాలనే యోచనలో ఉన్నారు. నెల్లూరు నగరపాలకసంస్థతో పాటు కావలి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, అల్లూరు పురపాలక సంఘాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.161.17 కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.94.01 కోట్లే వసూలైంది.

పురపాలక సంఘం	పన్ను లక్ష్యం	వసూలైంది
	రూ.కోట్లలో..	
నెల్లూరు	130.39	76.06
కావలి	13.78	8.04
కందుకూరు	8.26	4.82
బుచ్చిరెడ్డిపాళెం	3.68	2.15
ఆత్మకూరు	3.45	2.01
అల్లూరు	1.60	94 లక్షలు

వేగవంతం చేస్తాం: చెన్నుడు, డిప్యూటీ కమిషనర్

పన్ను వసూళ్లను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వంద శాతం వసూలు చేస్తాం.

భువనేశ్వరీ పాహిమాం



దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో కలశస్థాపన ఊరేగింపులో ప్రధానార్చకులు రఘురామమూర్తి



దర్గామిట్ట అష్టలక్ష్మి ఆలయంలో గౌరీ అలంకరణ

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం కలశప్రతిష్ఠతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భువనేశ్వరి అమ్మవారు భవానీ అలంకరణలో పూజలు అందుకున్నారు. గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో, విరాట్‌నగర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గా అలంకారంలో దర్శనమిచ్చారు. ● దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. నెల్లూరు(దుర్గామిట్ట): నెల్లూరు గ్రామీణ మండల పరిధిలోని జొన్నవాడ మార్గంలో కొలువుదీరిన కాళికామాత సమేత కాళేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. నెల్లూరులోని దుర్గామిట్ట క్రాంతి నగర్‌లో వెలసిన శివకేశవుల దేవస్థానంలో అమ్మవారిని మొదటిరోజు బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. మూలాపేటలోని బ్రాహ్మణవీధి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని కాశీ అన్నపూర్ణమాతగా అలంకరించారు.



నరసింహకొండపై ఆదిలక్ష్మిగా..



భవానీ అలంకారంలో మూలాపేట భువనేశ్వరి



క్రాంతినగర్‌లో బాలత్రిపుర సుందరిగా..



బాలాజీనగర్‌లో బాలత్రిపురసుందరిగా..



రాజరాజేశ్వరి అమ్మవారి దర్శనానికి వస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు



రాజరాజేశ్వరికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దంపతులు

పట్టపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: పట్టపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కూటమి పార్టీలకు చెందిన పట్టపు కుల పెద్దలు, కూటమి పార్టీ నాయకులతో నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశం జరిగింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లకు పట్టపు నాయకులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలలో పట్టపు కులానికి పట్టపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి ద్వారా కోరారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 2016లో మత్స్యకారులకు ఆప్కాబ్ ఛైర్మన్ ఇచ్చిన ఘనత తెదేపాదేనన్నారు. జిల్లా మంత్రులు ఆనం, నారాయణ సహకారంతో పట్టపు నాయకుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: పొదలకూరు రోడ్డు పోలీసు కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయి మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. - రజిని

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం.
– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? ఫత్తేఖాన్‌పేటలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా రోడ్లపై చేరి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. – సుబ్బారావు

? బుజబుజ నెల్లూరు జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్డులో వినాయకస్వామి ఆలయం వద్ద కుక్కలు వాహనదారులను వెంబడిస్తున్నాయి. – మాధవరావు

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం.
– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి
– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

అబ్దుల్ అజీజ్‌కు ఎమ్మెల్యే సన్మానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను హరనాథపురంలోని ఆయన నివాసంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్‌గా ఎన్నిక కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ సన్మానించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.

రక్తదాతల సంఖ్య పెరగాలి



వివిధ సంస్థల వ్యవస్థాపకుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రాష్ట్రంలో రక్త నిల్వలు కొరత వల్ల ఇంకా అనేక మందికి రక్తం అవసరము ఉందని, రక్తదాతలు సంఖ్య పెరగాలని ముఖ్యంగా యువత ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని అత్యధిక సార్లు రక్తం ఇప్పించిన రక్తదాన ప్రేరేపకుల(మోటివేటర్స్)కు జ్ఞాపికలు, ప్రశంసా పత్రం అందించే కార్యక్రమం నగరంలోని రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయం రక్తనిధి కేంద్రంలో గురువారం జరిగింది. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్‌హెన్రీ డ్యూనాంట్, ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఇమ్యునోహెమటాలజీ వ్యవస్థాపకులు డాక్టర్ జేజి జోలీల చిత్రపటాలకు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యధిక సార్లు రక్తదానం చేయించిన చిరంజీవి ఫ్యాన్స్, హెల్పింగ్ హ్యాండ్స్ విజయభాస్కర్, మేకల అనిల్ తదితర 138మంది రక్తప్రేరపకులను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు, వైస్‌ఛైర్మన్ సుధీర్‌నాయుడు, సభ్యులు రవిప్రకాష్, మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సారూ.. తాగునీటి వృథా పట్టదా?



నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో నిత్యం తాగునీరు వృథాగా పోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అసలే అరకొరగా అందుతున్నాయి. వృథాను అరికడితే అందరికీ పుష్కలంగా నీరు అందే అవకాశం ఉంది. 43వ డివిజన్ జెండావీధిలోని మస్జిద్ ఆలా వద్ద తాగునీటి కుళాయికి ట్యాప్ విరిగిపోయి నిత్యం వందల లీటర్ల నీరు కాలువలోకి చేరుతోంది. అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. కుళాయికి ట్యాప్ ఏర్పాటు చేస్తామని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

వ్యాధులకు నిలయాలు.. ఖాళీ స్థలాలు

నెల్లూరు ఇరుగాళమ్మ సంఘంలోని పలు ఖాళీ స్థలాలు వర్షపునీరు చేరి దోమలకు నిలయాలుగా మారాయి. నెలల తరబడి నీరు నిలిచి మురుగు తటాకాలుగా మారాయి. దుర్గంధంతో పాటు వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. స్థలాల్లో పిచ్చి మొక్కలు మొలవడంతో విషపురుగులకు ఆవాసంగా మారుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తామని నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ తెలిపారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



డివైడర్ల నిర్మాణానికి చర్యలు



నగరంలోని పొదలకూరు రోడ్డులో బట్వాడిపాళెం కూడలి నుంచి ర.భ రహదారిపై డివైడర్లు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకు ర.భ అధికారుల సహకారాన్ని కార్పొరేషన్ అధికారులు కోరారు. ర.భ అధికారులు రెండు రోజులుగా పొదలకూరు రోడ్డు మధ్యలో డివైడర్లను నిర్మించేందుకు కొలతలు వేస్తున్నారు. ముందుగా రహదారులకు శాశ్వత మరమ్మతులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

వ్యర్థాలు తొలగించి బోర్డు ఏర్పాటు

స్పందనకు వందనం



నెల్లూరు నగరంలోని పోలీసు కాలనీ రైల్వేట్రాక్ వెంట వ్యర్థాలు గుట్టలుగా వేసి తగులబెడుతున్నారు. రైల్వేట్రాక్‌ను దాటి అవతలి ప్రాంతానికి వెళ్లే ప్రజలతో పాటు స్థానికులు దుర్గంధం భరించలేక అల్లాడుతున్నారు. సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించి నగరపాలకసంస్థ అధికారులు వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. 'ఇక్కడ చెత్త వేయరాదు' అనే బోర్డు ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

కనీస మరమ్మతులైనా చేయించండి

నగరంలో రోడ్లకు శాశ్వత మరమ్మతులు లేవు. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది. నవాబుపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం సెంటర్‌లో రోడ్డు గుంతలు పడి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గత కొంతకాలంగా ఈ పరిస్థితి ఉన్నా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(రంగనాయకులపేట)



మీసేవా సర్వీసులు పునరుద్ధరించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : మీసేవా సర్వీసులను పునరుద్ధరించాలని రాష్ట్ర మీసేవా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనిల్ పేర్కొన్నారు. గురువారం నెల్లూరు గ్రామీణ తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని అసోసియేషన్ నాయకులు కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముక్తియార్ అహ్మద్, దామోదర్, శ్రీనివాసులు, దొరబాబు, రాఘవేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపాళెంలో ముప్పేట సమస్యలు



చెత్త కేంద్రంగా పార్కు స్థలం

న్యూస్‌టుడే, నెల్లూరు(రంగనాయకులపేట)

నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్‌కు కూతవేటు దూరంలో రామలింగాపురానికి ఆనుకుని ఉండే ముత్యాలపాళెంలో సమస్యలు తిష్ఠ వేశాయి. మినీబైపాస్ హరనాథపుం సర్కిల్‌కు చేరువలో 19వ డివిజన్‌లోని ముత్యాలపాళెంలోకి వెళ్లాలంటే ముక్కుమూసుకోక తప్పదు. వీధుల్లో చెత్త పేరుకుపోయింది. ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. ఈ ప్రాంతానికి చెందిన రిజర్వుడ్ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు ఏళ్ల క్రితం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం చెత్త డంపింగ్ కేంద్రంగా మారింది. స్థానికులు వాహనాలకు పార్కింగ్‌గా వాడుకుంటున్నారు. కొందరైతే పశువులను కట్టేసి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక్కడ పార్కు అభివృద్ధి చేస్తే రామలింగాపురం, ముత్యాలపాళెం వాసులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఎవరికీ పట్టని అనుసంధాన రోడ్డు

మినీబైపాస్ నుంచి ముత్యాలపాళెంకు వచ్చే అనుసంధాన రోడ్డు ఏళ్లుగా మట్టిరోడ్డుగానే ఉంది. వర్షాకాలంలో బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీలుపడడం లేదు. సిమెంట్ రోడ్డుగా మారిస్తే సౌకర్యంగా ఉంటుందని స్థానికులు తెలిపారు. ● నగరపాలక అధికారులు మాట్లాడుతూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



మినీబైపాస్‌ను కలిపే అనుసంధానం రోడ్డు దుస్థితి

విశాఖ ఉక్కు పరిశ్రమను కొనసాగించాలి



దీక్ష చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. స్టీలు ప్లాంటుకు భూములు ఇచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరసాని కోటిరెడ్డి, షాన్‌వాజ్, వెంగయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు డిమాండ్

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్ఐవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దసరా సెలవులు ఇస్తే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తున్నారని ఆవేదన చెందారు. నగర నాయకులు శరన్, వంశీ, హనీష్, స్వరూప్, శీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగర నియోజకవర్గంలో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కల్పిస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. గురువారం కార్యాలయంలోని ఛాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో నెల్లూరునగర తహసీల్దారు షఫి మాలిక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు వి.ఆనంద్‌రావు, జూనియర్ అసిస్టెంట్ చక్రపాణి, వివిధ పార్టీల ప్రతినిధులు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, రాజశేఖర్, బాలసుధాకర్, బి.శ్రీరామ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతిచెందిన సులోచనమ్మ నేత్రాలను వారి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు గురువారం సేకరించారు. ఈ సందర్భంగా సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ పి.విజయ మాట్లాడుతూ సులోచనమ్మ మృతిచెందినప్పటికీ మరో ఇద్దరికి నేత్రాలు దానం చేసి చూపు కల్పించనున్నారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు అభినందనలు చెప్పారు.

5 నుంచి ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్-3 ఈనెల 5, 6, 7 తేదీలలో నగరంలోని వీఆర్సీగ్రౌండ్‌లో జరుగుతుందని ఆ సమితి నాయకులు తెలిపారు. చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించాలని తెలిపారు. సమావేశంలో విద్యాకమిటీ రాష్ట్ర సభ్యులు కొండూరు లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి మేకల వెంకయ్య, ప్రచార కమిటీ సభ్యుడు యానాదయ్య, ఎంఎస్ఎస్ కార్యకర్త బెల్లంకొండ గిరీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లకు తరచూ అంతరాయం

న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

జిల్లావ్యాప్తంగా ఫోన్‌లైన్లు సవ్యంగా లేకపోవడంతో వినియోగదారులు అసహనానికి గురవుతున్నారు. గత 20 రోజుల నుంచి ఫోన్ ఎత్తగానే సెకన్ల వ్యవధిలోనే లైన్ కట్ అయిపోతోంది. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో సమస్య అధికంగా ఉంది. బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ఫోన్లే కాదు.. ఇతర కంపెనీలకు సంబంధించిన వివిధ రకాల లైన్లు కొన్ని ప్రాంతాల్లో సరిగా పనిచేయడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా వేదాయపాళెం, దర్గామిట్ట, పత్తేఖాన్‌పేట, టక్కేమిట్ట, మాగుంట లేవుట్, దర్గామిట్ట, మూలాపేట, పొదలకూరు రోడ్డు, రామలింగాపురం, చిల్డ్రన్స్‌పార్కులోని వివిధ ప్రాంతాల్లో ఫోన్‌లైన్లు సరిగా లేక అవస్థలు పడుతున్నారు. టవర్ల నుంచి సిగ్నల్స్ సరిగా రాకపోవడమే ఇందుకు కారణమని పలువురు ఆవేదన చెందుతున్నారు.



రెడ్‌క్రాస్ ప్రాంతంలో గుంతలో టెలికాం తీగలు

గుంతల్లో టెలికాం తీగలు

నెల్లూరు నగరంలోని పలు ప్రైవేట్ టెలికాంలకు చెందిన తీగల మరమ్మతుల పేరుతో గుంతలు తవ్వి అలాగే వదిలేస్తున్నారు. దీంతో వర్షం వచ్చినా, అందుకు సంబంధించిన తీగలు గుంతల్లోనే పాడైపోతున్నాయి. ఇలాంటి గుంతలతో ప్రయాణికులు సైతం అవస్థలు పడుతున్నారు. రెడ్‌క్రాస్ రోడ్డు, వేదాయపాళెం, దర్గామిట్ట, సరోజినీనగర్, పొదలకూరు రోడ్డు ప్రాంతాల్లో ప్రైవేట్ టెలికాంకు చెందిన తీగల కోసం గుంతలు తవ్వి అలాగే వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

● ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జీఎం ఎం.శ్రీనివాస్‌రావు స్పందిస్తూ నెల్లూరులో వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను ట్రాయ్ సంస్థ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



ఎం-1 సినిమాస్– స్క్రీన్1.. స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3..స్వాగ్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. స్వాగ్, స్క్రీన్2..దక్షిణ, సత్యం సుందరం, స్క్రీన్3..కల్కి, జోకర్(ఇంగ్లీష్), స్క్రీన్4..స్క్రీన్5..దేవర, **రెయిన్‌సినిమాస్**-స్క్రీన్1..దేవర, స్క్రీన్2..స్వాగ్, దేవర, స్క్రీన్3..సత్యం సుందరం, జోకర్(ఇంగ్లీష్), స్క్రీన్4.. బహిర్భూమి, దక్షిణ, కల్కి, **సిరిమల్టీప్లెక్స్**..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. స్వాగ్, స్క్రీన్3..సత్యం సుందరం

బంగారం పథకం పేరుతో మోసం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: బంగారం పథకం పేరుతో పలువురిని మోసం చేసిన వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రామ్మూర్తి నగర్‌లో రిషిత కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు కాపువీధిలోని ఓ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేస్తున్న ఓ మహిళ స్నేహితురాలు. ఆమె ద్వారా బంగారు వ్యాపారి వెంకట సునీల్‌కుమార్ పరిచయమయ్యాడు. ఆయన తాను బంగారం స్కీం నిర్వహిస్తున్నానని, నెలకు రూ.5వేల చొప్పున 11 నెలలు చెల్లిస్తే 12వ నెలలో రూ.5వేలు బోనస్ కలిపి బంగారు ఆభరణం ఇస్తానని నమ్మబలికాడు. దీంతో రిషితతో పాటు ఆమెకు తెలిసిన పలువురు స్కీంలో నగదు చెల్లించారు. స్కీం కాలపరిమితి ముగిసినా సునీల్ బంగారు ఆభరణాలు ఇవ్వలేదు. బాధితులు నిలదీయడంతో చెల్లని చెక్కులు ఇచ్చారు. గట్టిగా నిలదీయగా అసభ్యకర పదజాలంతో దూషించడమే కాకుండా దౌర్జన్యం చేశారు. బాధితులు బుధవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.